

# బాదరాయణ సమ్మంధం—మయం మయం

రచన: పంతుల విశ్వనాథరావు

"ఏదమ్మోడూ. ఒక్కరూపాయి వుంటే ఇమ్మీ" అందట ఓరోజు. వాళ్ల తమ్ముడిగారి వూరినుంచి వచ్చి రిక్షా దిగుతూనే, కామాక్షమ్మగారు వీధి గుమ్మంలో నిలబడ్డ మా ఆవిడని ఉద్దేశించి,

కామాక్షమ్మగారంటే మాఇంటి ప్రక్కవాటాలో కాపురముంటున్న 'రిటైర్డు రైల్వే స్టేషన్‌మాస్టారి భార్య. పిల్లా జెల్లా, చీకు చింత లేకపోవడంవల్ల చేతికి నోటికి దారి సాఫీగా జరుగుబాటు కావడంవల్ల ఆమెకు ఏభై ఏళ్లు వయస్సు ఉన్నా, ముదర యవ్వనంలోని మనిషిలా కనిపిస్తుంది. నిండుగా బొద్దుగా వుండే విగ్రహం పుష్టి, నెరిసీనెరియని జుత్తు, పచ్చగా పసుపు రాసుకున్న నుదుటి మీద ముద్దబంతి పువ్వంత ఎర్రని కుంకం బొట్టు—కళగా వుండే ముఖం ఆవిడది. ఎప్పుడూ నవ్వుతూ కలకల మాట్లాడుతూ ఉండే ఆవిడని పేటలోని వారంతా 'అందరికి తలలో నాలిక' అంటూ వుండేవారు.

ఆవిడ అడిగిందే తడువు— మహాభాగ్యమనుకొని మా ఆవిడ ఆ నెలాఖరు రోజులలో తన దగ్గర దాచుకున్న ఒక్కరూపాయి పదిలంగా పట్టుకెళ్ళి ఇచ్చిందట...అంతే!

ఇది జరిగిన ఆరునెలల వరకు ఆ యిద్దరూ కలుస్తూనే ఉండేవారు. సరదాగా మాట్లాడుకునేవారు. ఎన్నో కబుర్లు చెప్పుకునేవారు. అయితే, కామాక్షమ్మగారు తను బదులు పుచ్చుకున్న ఆ ఒక్క రూపాయి సంగతి మినహాయించి మిగతా ఇహపరలోక వ్యవహారాలు మాత్రమే ముచ్చటిస్తూ ఉండేవారు. మా ఆవిడే ఎన్నోసార్లు పరోక్షంగా ఆ రూపాయి గురించి అడగాలని ప్రయత్నించి, గంగాజల ధారాహితంగా సాగే కామాక్షమ్మగారి వాగ్ధోరణితో సాంతేల విఫలురాలైంది. ప్రత్యక్షంగా అసలే అడగలేక పోయింది...

ఒకనాటి మధ్యాహ్నం వీధి సావిట్లో విశ్రాంతిగా కూర్చుని 'చెల్లమ్మ'గారి దగ్గర అప్పుగా తీసుకున్న పావులా బదులు తీర్చనందుకు 'పుల్లమ్మ'గారికి తగువు చెప్తోంది కామాక్షమ్మగారు.

"చెత్త పావులా—పావులా డబ్బులు అప్పు చెయ్యనే కూడదు. చేస్తే వెంటనే తీర్చెయ్యాలి.." అంటూ చివాట్లు పెడుతోంది. ఇదే అదునుగా మా ఆవిడ తన కోపం కూడా తీర్చుకుందామని గబగబా పరుగెత్తిందిపక్కవాటాలోకి. అయితే అప్పటికే టక్కున ప్లేటు ఫిరాయించింది కామాక్షమ్మగారు. "పోనీ చెల్లమ్మ వదినా! నువ్వు పుల్లమ్మకి పావులా డబ్బులు ఇచ్చేవనే అనుకో. అంతమాత్రాన ఇంతగా పీడించాలా ఆమెని. ఏదో మరిచిపోయి వుంటుంది. మరోకారణం అయి వుంటుంది. పేటలో నలుగురం నాలుగణాలు పారేస్తే నీ బోడి పావులా నీ ముఖాన్ని తగులుతుంది. దానికోసం ఇంత తగువూ ఇన్ని రభసలూనా? ఛీ, పిదప కాలం పిన్నమనసులూనూ" అని నాలుగు దులిపింది మా ఆవిడని క్రీగంట చూస్తూ... ముఖాన కత్తి పేటుకి నెత్తురులేదు మా శ్రీమతిగారికి. పోయిన రూపాయి పోగా, ఈ చీవాట్లు ఎవరు భరిస్తారని 'కిం' మనకుండా వెనక్కివచ్చింది. ఆ తరువాత ఒకటిరెండు సార్లు తను గదిలో వంటరిగా వున్నప్పుడు కళ్ళు వత్తుకోడం, ముక్కు ఎగపీల్చడం కూడా జరిగింది.

"పోనీలేవే. ఒక్కరూపాయి కోసం ఏందుకేడవడం? నేను ఇచ్చుకుంటాలే నీకు" అన్నాను ఓరోజు ఓదారుస్తూ. అంతే. నా మీద ప్రురువాంది మా ఆవిడ "మీ రెప్పుడూ యింతే. నాదివేరు, మీది వేరు అని మనలో మనకే తన పరభేదం. అందుకే నా బతుకు ఇరుగమ్మకి పొరుగమ్మకి అలుసై పోయింది." అని నాలుగంటించింది నాకు. 'కిచ్చు' పెట్టేను నేను.

"ఆవిడకి బదులిచ్చిన రూపాయి 'మీది' 'నాది' కాదండీ 'మనది' ఆ రూపాయి 'మనది' అంది మా ఆవిడ 'మనది' అనే మాట గట్టిగానొక్కి పలుకుతూ.

నిజమే. ఆ రూపాయి తిరిగి వచ్చేవరకు పడవలసిన బాధ కూడా మా ఇద్దరిదీ కలిసే ననిపించింది నాకు.

దానురాను కామాక్షమ్మగారు మాఆవిడ పట్టుదలలు, తామషాలు పెంచుకొని పరస్పరం మాటలు కూడా మానుకున్నారు. పేటలోని—మంచినీళ్ల పంపు దగ్గర ఆఖరుకి 'పసుపుకుంకాల' దగ్గర కూడా రెండు పార్టీలు తయారైనయి. కొందరు ఈవిడ పార్టీ, కొందరు ఆవిడ పార్టీ, మిగతావారు 'పులుసులో ముక్కలు.'

ఈ దెబ్బలాట తగ్గించకపోతే పర్యవసానం ఘోరముగా కనుపించింది నాకు. ఓరోజు ధైర్యం చేసి, మా ఆవిడ ప్రొద్దున్నే పెరట్లో స్నానం చేస్తూ వుండగా, వీధి గుమ్మంలోంచి ప్రక్కవాటాలోకి వెళ్లి "పిన్నిగారూ" అని పిలిచేను. కామాక్షమ్మగారిని నేను అలాగే పిలిచేవాడిని. అసలు ఈ తగువంతటికి కారణం నేను ఆవిడని ఆవరస పెట్టి పిలవడమేమో ననిపిస్తుంది నాకు. నాకు 'పిన్నిగార' కాబట్టే ఆవిడ మా శ్రీమతిని కాపురాని కొచ్చిన కొత్తరోజుల్లో

